## పెళ్ళి సాంఘిక నిబంధన. అంతేకానీ, మనసు కదలికకి హద్దు కాదేమో!

**ఒకటీ అరా బీడీ ఏమైనా మిగిలి వుందేమోనని జేబులన్నీ వెదికాను. ఒకటి దొరికింది. దాన్నోసారి నాలికమీద తడిచేసి వెలిగించుకొన్నాను. గట్టిగా దమ్ములాగాను, వెచ్చగా వుంది.**

మాసిన గడ్డం జిలపెడుతున్నది. గోక్కుంటూ ముందుకు చూశాను. సారా దుకాణం ముందు కూర్చొని పెనంమీద చేప ముక్కలు కాలుస్తున్నది శాంత.

ఒక వంద గ్రాముల సారా తాగుదామంటే జేబులో పైసాకూడా లేదు. మహా చిరాగ్గావుంది. బ్రాందీ షాపు చుట్టూవున్న పిట్టగోడకు ఆనుకుని నిలుచుని శాంతవైపు చూశాను.

ఎవడితోనో మేళమాడుతున్నది.

బీడీ చేదుగా అనిపించి విసిరికొట్టాను.

ఇవ్వాల్టికి శాంతతో మాట్లాడి వారం రోజులు. ఈ వారం రోజుల్లోనూ నాకు సరిగా వ్యాపారం సాగనే లేదు. రైలు బండ్లల్లో తిరిగి కూల్‌డ్రింకులు అమ్ముకుంటాను నేను. ఒక కూల్‌డ్రింకు సీసామీద నాకు పావలా కమీషను.

నేను పదో తరగతి చదువుకున్నాను కాని.ఉద్యోగం ఎక్కడా దొరకలేదు. అందుకే ఈ పని మొదలెట్టాను ఎనిమిదేళ్ళ క్రితం. మా మాస్టార్లందరూ నన్ను తెలివైన కుర్రవాడ్నని అనేవారు. కాని నా తెలివి దేనికీ పనికిరాలేదు. ఉదయం ఏడున్నర మొదలుకొని రాత్రి పదకొండు గంటలదాకా బండ్లల్లో కూల్‌డ్రింకులు తీసుకొని తిరగడమే పని. తీరికేవుండదు. మనస్సూ,శరీరమూరెండూఅలసిపోతాయి. అందులో ఈ మధ్య ఒక్క రైలుబండీ కాస్తంత అటూ ఇటూ తిరిగి అమ్ముకొనేందుకు వీలుగా రావటంలేదు. గోడౌన్లలోకి నల్లబజారు వ్యాపారస్థుడు బస్తాలు నింపినట్లు ప్రతి రైలు పెట్టెలోనూ మనుషుల మీద మనుషులు, వాళ్ళ మధ్య చెక్క 'ట్రే'లతో నా కుస్తీ పట్లు.

సీజన్లోఅయితే పది. పదిహేను రూపాయలవరకూ వస్తుంది రోజుకి. కాని ఈ వారం రోజులుగా వ్యాపారం 'డల్'గా వుంది. రెండు మూడ్రోజులు సన్నని తుంపర్లు పడ్డాయి. తర్వాత వాతావరణం చల్లగావుంది. బంగాళా ఖాతంలో తుఫాను వుందేమో! ఇంకా యెవడు తాగుతాడు కూల్‌డ్రింకులు? ప్రతివాడూ ఏమైనా విస్కీసీసా లున్నాయా అని అడగటమే! అసలు ప్రభుత్వం వాళ్ళు రైలుబండ్లల్లో కూడా బ్రాందీ, సారా దుకాణాలు పెడితే బావుంటుంది. చెప్పలేనంత లాభం! యెలాగూ కిచెన్ రూంలు వున్నాయికదా! అలాగే యివీనీ!

శాంత అప్పుడప్పుడూ నావేపు ఓర చూపులు చూస్తున్నదన్న విషయం నేను గమనించక పోలేదు. కాని దానితో మాట్లాడాలంటే అహం అడ్డొస్తున్నది. వారం రోజుల క్రిందట బ్రాందీ షాపులోకి వేయించిన చేప ముక్కలు పట్టుకొని స్వయంగా వెళ్తే అక్కడెవడో బాగా 'డోసు' వేసుకున్న ఓ పెద్ద మనిషి దీని చెయ్యి పట్టుకున్నాడని బ్రాందీషాపులో సప్లై కుర్రాడు చెప్పిందగ్గర్నుంచీ నాకు కడుపు మండిపోతున్నది.

ఆ రోజు రాత్రి దాని దగ్గరకు వెళ్ళినపుడు—

అది నా గుండెల మీద పడుకుని నా ఛాతీమీది వెంట్రుకల్ని పెదిమల్తో పట్టుకొని ఆటలాడుతున్నప్పుడు—

నేను విన్న విషయం కదిపాను.

చురుగ్గా తలెత్తి నా వైపు చూసింది.

"అయితే ఏమైంది?" అనడిగింది.

"నాకు నచ్చదు. నేను నీకు చాలా సార్లు చెప్పాను నువ్వు బ్రాందీషాపులోకి వెళ్ళవద్దని అంతగా అవసరముంటే సప్లై కుర్రాడే తీసుకెళ్తాడు నీ దగ్గర్నుంచి చేపలు ...."

"మీ జాతే అంత! అన్నీ అనుమానాలూ ....పాడు బుద్ధులూ........" అని పక్కకుతిరిగి పడుకుంది శాంత.

ఈ పెంకి జవాబులు నాలో చిరాకును పెంచుతాయి. నేను చెప్పినట్టు వినకపోతే అమ్మను "అమ్మా" అనికూడా పిలువను నేను.

శాంత జుత్తు పట్టుకొని దాని మొహం నా వైపుకు తిప్పుకొన్నాను.


"అంటే ఎవడో పరాయివాడు నీ చెయ్యి పట్టుకోవచ్చా?" ఘాటుగా అడిగాను.

"నువ్వేం కట్టుకున్నోడివా?" అంది ఎకసెక్కెంగా.

శాంత సమాధానాలు పొగరుబోతుతనంతో నిండివుంటాయి. జవాబుగా ఆమె అడిగిన ప్రశ్న నన్ను పొడిచినట్లయింది.

నేను శాంతను పెళ్ళిచేసుకోలేదు. ఆ మాటకొస్తే నేను శాంతకంటే ఒక సంవత్సరం చిన్నవాడ్ని. శాంతకిప్పుడు యిరవై నాలుగేళ్లు. అయినా శాంత నాదని అనుకోవడమేతప్ప ఏనాడూ దాన్ని పరాయిదానిగా చూడలేదు. అందుకే దాని ప్రశ్న నాకు మరింత వేదన కలుగజేసింది. ఆ మాటకొస్తే అసలు శాంతకు మొదటి మగవాడ్ని నేనే.

శాంత యిదివరకు మగవాళ్ళంటే భయం భయంగా దూరంగా వుండేది. నవ్వుతూ దగ్గరకు వచ్చేది. కాని అంతలోనే దూరం వెళ్ళేది.



# కడలి

ఆనందకుమార్




అటువంటి స్థితిలో శాంత కు పెళ్ళి చేసింది దాని తల్లి. ఆ ముసల్దానికి తాను చచ్చిపోయేముందు శాంతనో యింటి దానిగా చూడాలని కోరిక.

పెళ్ళి చేసుకొమ్మంటే మొరాయించింది శాంత కాని ఏమనుకొందో, ఏమో పెళ్ళిచేసుకుంది. కాని మొగుడింటికి వెళ్ళిన రెండోరోజే వాడ్ని వదిలేసి తిరిగి వచ్చేసింది శాంత.

ముసల్ది ఆ రోజు గోల పెట్టీ పెట్టీ యిక తట్టుకోలేక గుండె పగిలి చచ్చింది.

ముసల్దిపోయిన పది రోజుల తర్వాత— నేను శాంతను నిలేశాను. "చూడు శాంతా! నువ్వంటే నాకిష్టం, నాతోవుండు" అని అడిగాను.

దానికి శాంత దిగులుగా మొహం పెట్టింది. "నేను సంసారానికి పనికిరాను" అంది.

"ఎందుకని?" అని అడిగాను ఆశ్చర్యంగా.

"నాకు భయం.... బాధ...." అంది తల వంచుకొని.

ముసల్ది తప్ప మరెవరూ లేరు శాంతకి. నేనూ, నా అన్నవాళ్ళ నందర్నీ వదిలేసి ఈ ఊరొచ్చాను. హోటల్లో తింటాను. ప్లాట్ ఫారంమీద పడుకొంటాను. ముసల్ది చచ్చిపోయిందగ్గర్నుంచీ శాంత ఒక్కతే వుంటుంది.

ఆ రోజు రాత్రి దానింటికి వెళ్ళాను.

శాంత చెయ్యి పట్టుకొన్నాను. శాంత బెదరిపోయింది. నా కాళ్ళు పట్టుకొంది. నేనంటే యిష్టమేగాని, సంసారం చెయ్యనంది.

నిజమే! శాంత సంసారానికి పనికిరాదు కాని, శాంతలో ఆడతనం వుంది. దానికి సంసారం చెయ్యాలన్న కోరికా వుంది. మరెందుకని సంసారానికి పనికిరాదు? ఎవరికేనా డాక్టరుకి చూపించాలి.

అదే మాట దానితో చెప్పాను. విచిత్రంగా చూసింది నావెపు. ఈ మాట

## మల్లెపందిరి

### ఆ దారిన పోవద్దు

ఒక వీధిలో ఒక అందకత్తె వుందికదా అని, ఆ పరిసరం మనోజ్ఞంగా ఉంది కదా అని పలువురు ఆ దారిన వెళ్ళడం సహజం. వెళ్ళేవాడు వెళ్ళక అక్కడ ఆగిపోతే చిన్నపాటి కొంటెతనం చూపిస్తే ఆవిడ మడమ తాపుతో దేహశుద్ధి చేసి పంపిస్తుంది. అయితే ఆ దేహశుద్ధి పొందినవాడు అక్కడే తన ఎర్ర ఎర్రని గాయాల్ని, పులకరింతల పూవులను ధరించి నిలబడిపోతే. కాస్తంత బుద్ధిమంతుడొకడు ఇలాగే నలుగుర్నీ హెచ్చరిస్తాడు. (భట్టేందు రాజకృతం)

ఉపపరిసరంగోదావర్యాః పరిత్యజ తాధ్వగాః
సరణిమపరోమార్గస్తావ ద్భవద్భిరవేక్ష్యతామ్।
ఇహహి విహితో రక్తాశోకః కయాపి హతాశయా
చరణనలినన్యాసో దంచన్నవాంకుర కంచుకః॥

గోదావరి (బండ్) వెంట వెళ్ళకండి మార్గస్థులారా. మరో దారేదైనా మీరు చూసుకోండి. ఎందుకంటే ఒక హతాశురాలు తన కాలి వ్రేటుతో కొత్త మొగ్గలు తొడిగిన గాయాలతో రక్తాశోకాన్నిక్కడ నిలబెట్టింది.

పెరటిలో ఉన్న రక్తాశోకానికి అలంకరించిన తన పాదంతో దోహద క్రియ జరిపిందా లతాంగి. ప్రియుడటువంటి దోహదక్రియను అపేక్షిస్తున్నాడు. ఇతరులెవరైనా వస్తే తన రహస్యం బైట పడుతుంది. ఇతరుల కీవిధ కాలితాపుగాయాలు చేసే ప్రమాదముంది. అందుకే హెచ్చరిస్తున్నాడు.

—సౌభరి

దానితో ఎవరూ అని వుండరు.

ఓ రోజు శాంతను బలవంతంగా పక్క టౌన్లోని ఒక లేడీ డాక్టరు దగ్గరకు తీసుకెళ్ళాను. ఆమె పరీక్షలు చేసింది.

బయటవున్న నా దగ్గరకు వచ్చి నా వైపు చూసింది.

"నీ పెళ్లామా?" అని అడిగింది నన్ను.

దాని మెడలో నల్లపూసల తాడువైపు ఓసారి చూసి "ఔ" నన్నాను.

"ఆపరేషను చేయాలి. మూడు వందల రూపాయలు తీసుకురా! ముందో నెల మందులు వాడాలి" అంది డాక్టరమ్మ.

"తర్వాత నేను కాపురం చెయ్యవచ్చా?" అని అడిగాను.

నవ్వింది డాక్టరమ్మ. "ఎక్ట్రీషియా.... ఆపరేషను చాలా చిన్నది. ఫర్వాలేదు" అంది.

ఆమె చెప్పింది ఏదైనా జబ్బు పేరేమో. అయినా మూడువందలు యివ్వటానికీ సిద్ధపడ్డాను. పెగా శాంతకూడా సంపాదిస్తుందె

ఆమె చెప్పిన మందులన్నీ కొని వాడింది శాంత.

ఆరు నెలల్లో నేను దానికి నూటాయాభై రూపాయలు యిచ్చాను. అది మరో నూటాయాభై రూపాయలు జమచేసుకుంది తర్వాత ఆపరేషను చేసింది డాక్టరమ్మ.

ఇప్పుడు రోజూ రాత్రిళ్ళు నేను శాంతతోనే గడుపుతున్నాను.

ఇంత జరిగాక కూడా శాంత నన్ను "నువ్వేం కట్టుకున్నోడివా?" అని అడుగుతున్నది.

"నేను కట్టుకున్నా. కట్టుకోకపోయినా నేను, నీకు మొగుణ్ని. నీతో యింకెవడేనా సరసాలాడితే నేను సహించను" అన్నాను గట్టిగా.

మాట్లాడకుండా మళ్ళీ పక్కకు తిరిగి పడుకోబోయింది శాంత.

"మాట్లాడవేం?" అన్నాను జుత్తుపట్టుకొని బలంగా మళ్ళీ నా వైపు తిప్పుకుంటూ.

"అబ్బ నొప్పి - వెంట్రుకలు వదులు" అంది బాధగా.

"నేనడిగిందానికి జవాబు చెప్పవేం?"

"యాపారంలో ఏదేనా జరిగితే దాన్నంత తప్పు పట్టుకుంటావేం?" అంది శాంత.

"తప్పు అవునో, కాదో నాకు తెలియదు. నువ్వు మరోసారి బ్రాందీ షాపులోకి పోవద్దు" అన్నాను.

"సర్లే-" అంది.

కానీ ఆ మరునటి రాత్రే మళ్ళీ బ్రాందీ షాపులోకి చేపముక్కలు తీసుకొని స్వయంగా వెళ్ళింది.

సముద్రంలో అలలు ఎంత ఉధృతంగా ఒక్కొక్కప్పుడు లేస్తాయో అంత ఉధృతంగానూ ఎగిరిపడ్డాను దానిమీద. ఆ రాత్రి దాన్ని విపరీతంగా కొట్టాను. విపరీతంగా తాగాను. దాని మొహం కూడా చూడనని వచ్చేశాను.

దాన్తో పోట్లాట పెట్టుకొన్నాక నా మనసు మనసులో లేదు. కూల్ డ్రింకులు అమ్మటానికి బండిలో వెళ్తూ బండిలో ఓ పెట్టెలో నుంచి మరో పెట్టెలోకి మారేటప్పుడు కాలుజారి క్రిందపడేవాడ్నే. కొద్దిలో తప్పిపోయింది. ఈ వారం రోజుల్లో పాసింజర్లని ఎంత నిర్లక్ష్యంగా చూశానో! వ్యాపారం దెబ్బతినక ఏం చేస్తుంది. నాతో పోటీపడి అమ్మే యితరులు-ఫర్వాలేదు! నా కంటే ఎక్కువే సంపాదించారు.

సారా కొట్టులోనుంచి యెవడో బాగా తాగి బయటకు వచ్చాడు. శాంత చేపల కొట్టుదాటి ముందుకు వచ్చాడు. అక్కడో మురిక్కాలువ వుంది. ఇంక నడవలేక అందులో దిగబడిపోయి తనలో తానే ఏదో గొణుక్కుంటున్నాడు. జ్ఞాని!

నాకింక తాగటానికి బీడీలులేవు. సారాకు డబ్బుల్లేవు.

రైల్వేస్టేషనువైపు వెళ్దామని బయలేరాను. సారాదుకాణం ముందునుంచే వెళ్ళాలి.

రాని ఈలను వేయటానికి ప్రయత్నం చేస్తూ చాలా తీరిగ్గా నడుస్తున్నాను.

"మరీ యింత కోపమైతే ఎట్లా బ్రతకడం?"

చటుక్కున శాంతవైపు చూశాను దాని కళ్ళు నవ్వుతున్నాయి. పెదిమలు బిగించి నావైపు చూస్తున్నది. నా గుండె డ్యూయెట్లు పాడుకుంటూ రాకెన్ రోలు డాన్సు చేస్తున్నది. అంతసేపూవున్న చిరాకు మాయమైంది. ఆకాశమంతా నేనై ఎగిరిపోతున్నట్లనిపించింది. రెండుచేతులూ పాంటు జేబుల్లో పెట్టుకొని దీర్ఘంగా చూశాను దానివైపు. తర్వాత గంభీరంగా మాట్లాడకుండా రెండడుగులు ముందుకు వేశాను.

"మాట్లాడితే ముత్యాలేమైనా రాల్తాయా?" అనడిగింది శాంత.

సారా దుకాణంలో నుంచి ఎవడో వచ్చి అర్ధరూపాయి బిళ్ళ పడేసి "ఓ తల కాల్చి

యివ్వు" అన్నాడు.

"తలల్లేవు తోకల్లేవు - పోవయ్యా!" అని కసిరింది శాంత.

"ఓసోస్! ఈ దుకాణం అమ్మకుం టానికొ్కదా?...." అన్నాడు వాడు.

"ఇంకా వేగలేదు.," అంది మొహం చిటపటలాడించుకుంటూ.

వాడు మళ్ళీ సారా దుకాణంలోకి దూరాడు.

నేను నిలబడి శాంత వైపే చూస్తున్నాను.

"ఇక్కడికి రా!"అంది కోపంగా ఆజ్ఞాపిస్తున్నట్లు.

మంత్రం వేసినట్లు దగ్గరకు వెళ్ళి నిలబడ్డాను. బెస్తవాడ్ని సముద్రం తన లోపలకు లాక్కుంటున్నట్టు పిలిచింది శాంత.

ప్రక్కనే ప్రత్యేకంగా తీసిపెట్టిన చేపజెన తీసి ఒక ఆకులోపెట్టి యిచ్చింది. "తిను" అంది. తర్వాత చాలా సామాన్యంగా అనేసింది. "రాత్రికి కోడికూర. నీ కోసమే చేశాను."

ఆ రోజు రాత్రి యిద్దరం ఒకటే ప్లేటులో అన్నం తిన్నాం.

తర్వాత తలలో పూలు తురుముకుంటూ మంచంమీద పడుకున్న నా వైపు చూసి "గడ్డం యెందుకు పెంచావు?" అని అడిగింది.

మాసిన గడ్డాన్ని గోక్కుంటూ "డబ్బుల్లేవు" అన్నాను.

పక్కలోకొచ్చి కూర్చొని "నన్నడగ కూడదా?" అని అడిగింది.

"పోట్లాడావుగా—"

కిసుక్కున నవ్వి నామీద వాలి "నేను పోట్లాడానా? నిజం చెప్పు" అన్నది. నేను మాట్లాడలేదు. దాన్ని భద్రంగా నాచేతుల్లో దాచుకొన్నాను. కాని ఈ మనశ్శాంతి ఎక్కువ కాలం నిలువలేదు.

ఏ రైల్లోకి ఎక్కినా శాంతే కళ్ళల్లో నిలిచివుండేది. దాన్ని చూడకుండా వుండలేక పోయేవాడ్ని.

అందుకే ఓ రోజు అనుకోకుండా మధ్యాహ్నం వేళ దానింటికి వెళ్ళాను. పగలు శాంత దగ్గరకు వెళ్ళడం అదే మొదటిసారి.

శాంత కూనిరాగం తీసుకుంటూమంచం మీద అటూ యిటూ దొర్లుతున్నది. నన్ను చూసి ఆశ్చర్యంగా లేచి కూర్చుంది. మొహమంతా కళ్ళుచేసుకుని అడిగింది. "ఇంత పగలా రావడం? ఎవరూ చూశ్శేదా?"

నవ్వాను. "ఇదేమైనా రహస్యమా?"

"రహస్యమైనా కాకున్నా మాంసం తింటామని ఎముకలు మెడలో వేసుకొని






ఫోన్: 76369.

మిక్రో-మిక్స్

మీవద్ద వుంటే
మరో హస్తద్వయాన్ని
మీరు పొందివున్నట్లే



nirmala

ఆడియోవిజన్
ప్రకాశం రోడ్ * విజయవాడ-2.

చెవుడుకు చికిత్స

మీరు ఏ విధమైన చెవికి సంబంధించిన వ్యాధితోనైన బాధపడుతున్నట్లయితే మా ప్రత్యేకమైన మందును వాడండి. దాని వల్ల చెవినుండి చీము కారడం, పూర్తి చెవుడు మరియు చెవుకి సంబంధించి ఏ వ్యాధి అయినా తప్పక నయం అవుతుంది. మందు పని చేయనట్లు నిరూపిస్తే డబ్బు వాపసు చేయబడును. 1 సీసా ధర రు. 18/- పూర్తి కోర్సు రు. 45/- పోస్టేజి అదనం.

R. N. GUPTA & Co (AJ)
P. o Lal Bigha (Gaya)

ఉచితము! ఉచితము!

తెల్ల మచ్చలు

అన్నిరకాల మచ్చలను, ఎరుపు రంగును మా ప్రఖ్యాత మందు అయిదు రోజులలో మార్చును త్వరలోనే చర్మం మామూలు రంగు పొందును. ప్రచారం నిమిత్తం ఒక సీసా మందు ఉచితంగా పంపబడును. వెంటనే వ్రాయండి.

వివరాలకు :

Krishna Chandra Vaidaya (AJ)
P. o Katri Sarai (GAYA) INDIA

తిరగం" అన్నది శాంత.

వెళ్ళి దాని పక్కనే మంచం లో కూర్చున్న నాకు ఓ మూల చార్మినార్ సిగరెట్టు పీక కనబడింది.

నా గుండె నెవరో నులిమినట్లనిపించింది.

శాంతకు నేను కాక యింకెవరేనా వున్నారా?

దాని మొహం వైపు పరిశీలనగా చూశాను.

"ఏమిటట్లా చూస్తున్నావు" అనడిగింది వింతగా చూస్తూ.

నేను లేచి మూలకు నడిచి చార్మినార్ పీకని ఎత్తి చూపించాను.

"ఇదెక్కడి నుంచి వచ్చింది?" అనడిగాను.

నా వైపు ఓ రెండు నిమిషాలు చూసింది శాంత.

"మాట్లాడవేం?" నేను సహనం కోల్పోయాను.

"ఇక్కడికొచ్చిన తులసమ్మ కాల్చి పారేసింది" అన్నది నెమ్మదిగా శాంత.

"తులసమ్మ?.... ఎవరాతులసమ్మ?"

"భగత్‌సింగు విగ్రహం దగ్గరవున్న యిళ్ళల్లో వుంటున్నది" అన్నది తలవంచుకొని.

"ఎందుకొచ్చింది?"

"వాళ్ళ తమ్ముడింటిలో బారసాల అంట. పిలవడానికొచ్చింది"

నాకు నమ్మబుద్ధి కాలేదు.

శాంత లేచి మంచినీళ్ళు తెచ్చింది.

"తాగు!" అంది.

తాగాను.

ఎందుకింత అనుమానం నాలో? నా మీద నాకు నమ్మకం లేకనా? లేకుంటే శాంత మీద ప్రేమ ఎక్కువై యిటువంటి అనుమానాలు పుట్టుకొస్తున్నాయా!

కాని గుండెలో మండుతున్న మంట చల్లటి నీటితో ఆరిపోలేదు. తుఫానుగా ఈ అనుమానం మారక ముందే ఈ తులసమ్మ ఎవరో కనుక్కోవాలి.

ఆ రోజు సాయంకాలం భగత్‌సింగ్ విగ్రహం వైపు వెళ్లాను.

అక్కడికి దగ్గర్లోవున్న యిళ్ళన్నీ గుడిసెలు.

ఆ గుడిసెల మధ్య నుంచి ఒక మురికి కాలువ ప్రవహిస్తున్నది. ఊళ్లోని మురికినంతా గుడిసెల మధ్యకు తోసే ప్రయత్నం కావచ్చు.

నేను కాలువ దాటిపోలేదు.

కాలువ పక్కనే పిల్లలు దిస మొలల్తో ఆడుకొంటున్నారు. కాలువ దాటి యివతలకు ఓ మనిషివచ్చాడు. సన్నగా, ఊదితే పడిపోయేలా వున్నాడు.

"ఎవరు కావాల? ఈడ నిలబడ్డావు?" అనడిగాడు.

"తులసమ్మ—"

"తులసమ్మ ఊరికెళ్ళి రెండ్రోజులైంది. ఏ వూరో ఏమో తెలవదు" అంటూ వెళ్ళిపోయాడు.

ఆటలో పిల్లలు కేరింతలు కొడుతున్నారు.


దూరంగా రైల్వేస్టేషనులో డీజల్ యింజను ఒకటి గావుకేక పెడుతున్నది.

ఒంట్లోని సత్తువనంతా యెవరో లాగేసుకున్నట్లనిపించింది.

కోపం అలలాగా వచ్చి పళ్ళను పటపట లాడించింది.

వెనక్కు తిరిగి నడిచాను.

ఇప్పుడేవెళ్ళి శాంత నడిగితే? ఊహూ



అది నిజం చెప్పేదైతే ముందే చెప్పేసి వుండేది. అందులోనే నేలాగూ కట్టుకున్నవాడ్నికాను. మరెందుకని నా దగ్గర అబద్ధం? అది చెప్పని నిజంకన్నా ఈ చెప్పిన అబద్ధం నన్ను కోసున్నది. నిప్పునైనా చేతిలో పట్టుకోగలనేమోగాని ఈ నమ్మక ద్రోహాన్ని భరించలేను.

"నీ కమీషను రోజు రోజుకీ తగ్గిపోతున్న దేంట్రా? పనిలో వుంటావా? వుండవా?" అని కూల్‌డ్రింకు షాపు యజమాని ఈ రోజు నన్ను హెచ్చరించినప్పుడు కూడా నిర్లక్ష్యంగా తల ఎగరేసిన నేను ఒక చిన్న అబద్ధానికింత బాధపడటం ఎందుకు? నాలో ఎందుకిన్ని ఆలోచనల సుడులు? రోజంతా లక్ష్యమంటూ లేకుండా తిరిగాను తిరిగి తిరిగి చీకటి పడేవేళకు శాంత యిల్లు చేరాను.

అది అప్పుడే చేపలు తీసుకొని సారా దుకాణానికి వెళ్తున్నది. నన్ను చూసి మళ్ళీ తాళం తీసింది. "నేను బేరం చూసుకొని వస్తా. ఇవాళ్ళ ఆలస్యమైంది. పండుకో-" అని చెప్పి వెళ్ళిపోయింది.

వెళ్ళి మంచంమీద పండుకొన్నాను. "తిరగటంలో ఎంత అలసిపోయానో." అనిపించింది. కొంత సేపటికి నిద్రకూడా పోయాను.

శాంత తట్టి లేపుతుంటే మెలకువ వచ్చింది. దాని పలువరస దాని తలలోని పూలలాగే తళుక్కుమని మెరుస్తున్నది.

"ఏంటి యిల్లా నిద్రపోతున్నావేం? ఒంట్లో బాగలేదా?" అంది నా మీదకు వంగి ఆదురా నిండిన కంఠంతో.

కొద్దిసేపు మాట్లాడలేదు నేను. తర్వాత "నేను తులసమ్మదగ్గరకు వెళ్ళాను" అన్నాను ఒక్కొక్కమాట తూచి తూచి మాట్లాడుతూ.

నవ్వుతున్న దాని మొహంలో నవ్వు మాయమైంది. గదిలోని గుడ్డిదీపం వెలుగులో దాని మొహంలో భయం నీడలు పరుచుకోవటం స్పష్టంగా చూశాను. నా గుండెలో గునపం దిగినట్లయింది.

కొద్దిసేపు నిశ్శబ్దంగా వుంది శాంత. తర్వాత నెమ్మదిగా అంది– "మనం పెళ్ళి చేసుకుందాం."

"ఎందుకు?" అన్నాను.

"నేను నిన్ను కాకుండా మరెవరినైనా చూసుకుంటానని నీ అనుమానం."

"పెళ్ళి చేసుకున్నంత మాత్రాన అనుమానం పోతుందా?" అని అడిగాను నేను.

దాని మొహంలో బాధ కనిపించింది.

"నేను నీకు నిజం చెప్పలేదు. మధ్యాహ్నం నువ్వు వచ్చేముందు పాన్ షాపు నర్సయ్య ఈ దారిన పోతూ లోపలకు వచ్చి నన్ను పలుకరించాడు. ఆ మాటల్లో సిగరెట్టు మూలకు విసిరేశాడు. నువ్వు ఇంకో విధంగా అర్థం చేసుకుంటావని నేనే భయపడాను" అంది శాంత.

శాంతను దగ్గరకు తీసుకున్నాను.

"నాలోని ఆలోచనలకు పెళ్ళి హద్దు కాదు" అన్నాను.

అర్థం కానట్లు నా వెపు చూసింది శాంత. సముద్రాల్లో సుడిగుండాలు సహజం–అంతకంటే ఎక్కువ నేనేమీ చెప్పలేను.


# క్యాన్సరు విముక్తి



నా పేరు. వై. నాగరత్నం

వయస్సు 50 సంవత్సరములు. సంతానము 7 గురు పిల్లలు. నా పొత్తి కడుపులో పోటు ప్రారంభమై ఎర్ర గడ్డ ప్రారంభమైనది. అప్పుడు నేను డాక్టర్‌కి చూపించగా క్యాన్సరు ఆసుపత్రికి వెళ్ళమని సలహా ఇచ్చారు. క్యాన్సరు నిపుణులు నన్ను పరీక్షించగా నా గర్భకోశానికి క్యాన్సరు వున్నట్లు నిర్ణయించి 16 కరెంటు చికిత్స జరిపారు. అంతేగాకుండ ప్రైవేటు వైద్యం కూడా తీసుకున్నాను. లాభము లేక పోయింది. తుదకు చిక్కడపల్లిలో ఉన్న డా. యం. బాబూరావుగారి దగ్గర కొందరు వ్యాధిగ్రస్తులు నయమైనట్లుగా తెలుసుకొని, అక్కడికి వెళ్ళి చికిత్స తీసుకున్నాను. ఈవిధముగా 12 వారములు మందు డా.యం. బాబూరావుగారి దగ్గరవాడి తదుపరి క్యాన్సరు నిపుణుల దగ్గరకి వెళ్ళి పరీక్షచేయించుకొనగా నాకు క్యాన్సరులేదని నిర్ణయించిరి. నాకున్న బాధలు పోయాయి. నేను నా పిల్లలతో, భర్తతో హాయిగా ఉన్నాను. ఈభయంకర వ్యాధి నుండి డా. యం. బాబూరావుగారు నన్నురక్షించినారు. నేనువారికి జన్మాంతరము రుణపడిఉన్నాను. వారిభార్యాపిల్లలు చల్లగావుండాలని దేవుడిని ప్రార్థించుచున్నాను.

ఇట్లు,
వై. నాగరత్నం, C/O వై. సత్యవేదం
E. C. I. L. N. I. D. Section, పోస్టు: మౌలాలి,
చర్లపలి, హైదరాబాదు.

| డాక్టరుగారి అడ్రసు | ఫోను | సంప్రదింపు రోజులు |
|---|---|---|
| 1. కాన్సర్ ఇన్‌ఫర్మరీ 1-1-271/3 చిక్కడ్‌పల్లి హైదరాబాద్-20 | ఫోన్ : 64735 | ప్రతి గురువారము శుక్రవారము |
| 2. మద్రాసు C/o. హోటల్ సుధారా ఉస్మాన్‌రోడ్, టి. నగర్ మద్రాసు-17 | ఫోన్ : 445164 | ప్రతి శనివారము |
| 3. బెంగుళూరు C/o. బృందావన్ హోటల్ యం. జి. రోడ్ బెంగుళూరు-1 | ఫోన్ : 53271 | ప్రతి ఆదివారము |
| 4. బొంబాయి C/o. హోటల్ మిడ్‌టౌన్ రైల్వే స్టేషన్ ఎదుట అంధేరీ (వెస్ట్) బొంబాయి | ఫోన్ : 565734 | ప్రతి బుధవారము |